నీటి బొట్టు లేక..!

- సందిగ్ధంలో రైతులు
- ఖరీఫ్ సాగుపై ఆశలు సమాధి
- పోలవరం, తాడిపూడికి చుక్క నీరందని వైనం



గోపాలపురంలో నీరందక నాట్లు వేయని పొలం

గోపాలపురం: ఖరీఫ్ సాగుపై గంపెడాశలు పెట్టుకున్న రైతన్నలకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఒక వైపు భూగర్భ జలాలు ఎండిపోవడం..మరోవైపు వర్షాలు పడకపోవడం అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసిన రైతులు సరైన వర్షాలు లేక కుంగిపోతున్నారు. వర్షం వస్తే విత్తనం విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. చేతిలో చిల్లిగవ్వలేని రైతులు పంట సాగుకు పెట్టుబడుల కోసం ఇళ్లలో ఉన్న బంగారాన్ని, ఇంకొందరు అధిక వడ్డీలకు అప్పులు చేసి వర్షాలు కోసం ఇంకా ఎదురుచూస్తున్నారు. పరిస్థితులు అనుకూలించక పోవడంతో వరినాట్లు వేయాలా వద్దా అన్న సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

భూగర్భ జలాల కొరత

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని లోతట్టు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. మెట్టప్రాంతాలకు పిల్ల కాలువలు తీయకపోవడంతో చుక్కనీరు కూడా అందడం లేదు. పోలవరం కుడి ప్రధాన కాలువ పొలం పక్కనుంచి పారుతున్న నీరు చూడటం తప్ప ఒక్క చుక్కకూడా అందదు, కనీసం కాలువ నుంచి నీరు భూమిలోకి ఇంకడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఆగస్టు నెల పూర్తి కావస్తుంది. అటు వానలు సరిగా పడక..ఇటు గ్రౌండ్ వాటర్ సరిగ్గా లేక రైతన్నల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వానలు సమృద్ధిగా కురవక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

ఇది పరిస్థితి

గోపాలపురం మండలం భీమోలు రోడ్డులో ఉన్న సుమారు 60 ఎకరాలకు సాగునీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో నాట్లు వేయకుండా రైతులు ఎదురుచూస్తున్నారు. జూన్, జులై నెలల్లో అధిక వర్షాలు కురవడం, వరినాట్లు వేసే సమయానికి వర్షాలు లేకపోవడంతో రైతులు పరిస్థితి అతివృష్టి, అనావృష్టి అన్న చందంగా మారింది. సాయంత్రం సమయంలో తేలికపాటి జల్లులు మాత్రమే పడుతూ అన్నదాతలను ఊరిస్తున్నాయి. అలా వరుణిడి కరుణ కోసం ఎదురుచూపులు చూస్తున్న రైతన్నల ఆశలు ఆవిరవుతున్నాయి. అయితే మాన్‌సూన్ ప్రారంభమై నెలలు దాటుతున్నా..మండలంలో ఎక్కడ చూసినా వ్యవసాయ భూములు పచ్చగా కనిపించడం లేదు. వానల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు..ఆరుతడి పంటలతో పాటు మెట్టపంటల సాగుకు సిద్ధమయ్యారు. అయితే భారీ వర్షాలు పడకపోవడంతో కుంగిపోతున్నారు.

300 ఎకరాల్లో పడని వరినాట్లు

మండలంలోని గోపాలపురం, వాదాలకుంట, వెదుళ్లకుంట, కోమటికుంట, జగన్నాధపురం, కరిచర్లగూడెం గ్రామాల్లో కేవలం చెరువులు, వర్షాధారంపైనే ఆధారపడి నాట్లు వేస్తారు. ఈ పొలాలకు తాడిపూడి, పోలవరం కాలువలు నుంచి చుక్కనీరు కూడా అందదు. అందువల్ల సుమారు 300 ఎకరాల భూమి ఎటువంటి సాగుకి నోచుకోవడం లేదు. వరి పొలాల్లో బోర్లు వేసి పంట సాగు చేయడానికి ఆర్థిక పరిస్థితి అనుకూలించక పోవడం, బోర్లు వేయడానికి అనుమతులు లభించక పోవడంతో ప్రతి ఏటా వర్షాధారంపైనే ఆధారపడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు కష్టంగా ఉంది



ఈ ఏడాది వరినాట్లు వేయడానికి ఆలోచించాల్సి వస్తుంది. రెండు నెలలు ముందుగా అధిక వర్షాలు పడ్డాయి. అందువల్ల ఆగస్టు నెలలో వర్షాలు లేక నాట్లు వేయాలా వద్దా అని ఆలోచిస్తున్నాం. దుక్కులు దున్ని సాగుకు సమాయత్తం చేస్తున్నాం.

ఎం.గంగరాజు, రైతు

ప్రాజెక్టులతో ప్రయోజనం సున్నా..



చుట్టూ నీరు ఉన్నా చుక్కనీరు అందదు, చెరువులపైనే ఆధారపడ్డాం. తాడిపూడి, పోలవరం కాలువ ద్వారా నీరు ప్రవహిస్తున్న మెట్ట ప్రాంత భూములకు చుక్కనీరు అందడం లేదు. బోర్లు వేయడానికి ఆర్థిక స్తోమత లేక కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంట సాగు చేస్తున్నాం.

వారపు శశికుమార్, రైతు

క్లుప్తంగా

మంచినీటి ఎద్దడి

దేవరపల్లి: దేవరపల్లి–బుచ్చియపాలెం రోడ్డులోని పంచాయతీ మంచినీటి బోరు మోటారు కాలిపోయి దాదాపు 10 రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో దాదాపు 500 కుటుంబాలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. బోరు నుంచి పైప్‌లైన్ ద్వారా శివాలయం వద్ద ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని ఎక్కించి అక్కడ నుంచి నేరుగా హైస్కూలు రోడ్డు, చంద్రబాబు కాలనీ, బాలదుర్గమ్మ ఆలయం, పల్లంట్ల రోడ్డు ప్రాంతాలకు సరఫరా అవుతుంది. దీంతో 10 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో కనీస అవసరాలకు ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ వై.రాజారావును వివరణ కోరగా శుక్రవారం నాటికి సమస్య పరిష్కారించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చినట్టు తెలిపారు.

ఇసుక లారీల సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

గోపాలపురం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు లారీలను జిల్లా మైనింగ్ అధికారులు పట్టుకున్నట్లు ఎస్సై పి.మనోహర్ గురువారం విలేఖరులకు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గూటాల, తాళ్లపూడి, పట్టిసీమ ఇసుక ర్యాంపుల నుంచి పరిమితికి మించి లోడుతో, బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తెలంగాణా రాష్ట్రానికి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

తాళ్లపూడి: సచివాలయ ఉద్యోగులపై వాలంటీర్స్ కంటే ఎక్కువ పనిభారం మోపుతున్నారని, పని భారాన్ని తొలగించాలని కోరుతూ ఉద్యోగులు గురువారం తాళ్లపూడి ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డికి మెమొరండం అందజేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తాళ్లపూడి మండల సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవోకు తమ సమస్యలను విన్నవించారు. సిబ్బందిని సర్వేల పేరుతో ప్రతి ఇంటికీ తిప్పుతున్నారని, గత ప్రభుత్వంలో వాలంటీర్లు చేసే పనులను తమకు కేటాయించడం దారుణామని, పని భారం తగ్గించాలని వినతి పత్రాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

నిడదవోలు: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ మూడో నెంబర్ హైస్కూల్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు, ఐఆర్ ప్రకటించాలని, పాత బకాయిలు చెల్లించాలని కోరారు. యాప్స్‌ను రద్దు చేయాలనే డిమాండ్లతో 17వ తేది వరకు నిరసన చేపడతామన్నారు. హెచ్ఎం పి.ధర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

తాళ్లపూడి: మండల ఆర్యవైశ్య సంఘం, మహిళ సంఘాలకు సంబంధించి నూతన కార్యవర్గ సభ్యులను గురువారం ఎన్నుకున్నారు. ఈ మేరకు తాళ్లపూడిలో జరిగిన సమావేశంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా యండపల్లి శేఖర్‌తో పాటు మరో ఎనిమిది మందికి కార్యవర్గంలో చోటు దక్కింది. మండల మహిళ అధ్యక్షురాలిగా కొండూరి మహాలక్ష్మిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ పెద్దలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని దానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు, అప్పన శ్రీకాంత్, రవి, కూనల రాజా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ



మిథున్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ పార్టీ ముఖ్యనేతలు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా పార్టీ ముఖ్య నాయకులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గుండుగొలను గరుడా కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రూడా మాజీ చైర్మన్ షర్మిల రెడ్డి, మాజీ ఎంపీ గురుమూర్తి, నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల, గోపాలపురం నియోజకవర్గ నాయకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మోసం చేయడం బాబుకు అలవాటే



కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): ఎన్నికల్లో హామీ ఇచ్చి పథకాలు పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండిపడ్డారు. పట్టణంలోని 5వ వార్డులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ గ్రామస్థాయి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి వార్డులో కూటమి మోసాలపై రచ్చబండ ఏర్పాటు చేసి చంద్రబాబు 15 నెలల పాలనలోని మోసాలను పట్టణ ప్రజలకు వివరించారు. సమావేశంలో తలారి మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టు బాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. చిత్త శుద్ధి ఉంటే ముందు రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జగన్ పథకాలను ఉల్టా చేసి వాటినే అమలు చేస్తు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, 5వ వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, పట్టణ మహిళా అధ్యక్షురాలు వీర్ల శ్రీహరి పద్మ, పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం ,జిల్లా ఉపాధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, కౌన్సిలర్ అంకోలు లిల్లి, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తలారి



మిథున్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): రాజంపేట వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నాయకులతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి వెంకట్రావుతో పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ సెక్రెటరీ సుంకర సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, తాళ్లపూడి కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

నిడదవోలు: స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్లో గురువారం నియోజవర్గ స్థాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 120 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిని మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లల పట్ల శ్రద్ధ చూపించినట్లయితే వారు కూడా భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించి మంచి పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. ఎంఈఓ కె.గణేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రవాణా అలవెన్సులు, ఎస్కార్ట్ అలవెన్సులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఈఆర్‌టీ సమన్వయకర్త ఎస్.కనకబాబు, ఎంఈఓలు పి.గురుమూర్తి, షేక్ సూర్జాన్, దిడ్ల జ్యోత్స్న, ఐఈఆర్పీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసేలా మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తున్నట్లు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి తెలిపారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పలు గ్రామాల్లో ప్రాధాన్యత పనులు గుర్తించామని, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ వడల రత్న కుమారి, ఎంపీటీసీ సభ్యులు బయ్యే కృష్ణబాబు, కొప్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే పనులపై ఎంపీటీసీ సభ్యులకు అధికారుల నుంచి సమాచారం ఉండటం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ జగన్నాథరావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్లాది చంద్రశేఖర శాస్త్రి జయంతి

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటోరియంలో అభినవ వ్యాస, సవ్యసాచి, ప్రవచన భార్గవ, తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన పండితుడు మల్లాది చంద్రశేఖర శాస్త్రి శతజయంతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బ్రహ్మశ్రీ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి, దెందులూరి సీతారామ శర్మ, లొల్ల రమేష్‌లు జ్యోతి ప్రజ్వలనతో మల్లాది చంద్రశేఖర్ నివాళులర్పించారు. వక్తలు బ్రహ్మశ్రీ మల్లాది వేంకట రామనాథ శర్మ, బ్రహ్మశ్రీ మల్లాది శ్రీరామచంద్ర శర్మలు మాట్లాడుతూ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రవచనాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, మారిశెట్టి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ చేతివృత్తుల అధ్యక్షుడిగా శ్రీనివాస్



దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గోపాలపురం చేతి వృత్తుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా దేవరపల్లి మండలం యర్నగూడెంకు చెందిన చిటికిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అభివృద్ధికి తాను చేసిన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ హోంమంత్రి తానేటి వనిత, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నాణ్యతపై దృష్టి పెట్టండి

దేవరపల్లి: మార్కెట్‌లో ఏ గ్రేడు పొగాకు కొనుగోళ్లు మందకొండిగా ఉందని, ఈ ఏడాది పొగాకు నియంత్రణ పాటించి నాణ్యతపై దృష్టిపెట్టాలని బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పల్లంట్లలో గురువారం వేలం కేంద్రం నిర్వహణాధికారిణి సీహెచ్ హేమస్మిత అధ్యక్షత నిర్వహించిన నారుమడి యాజమాన్య పద్ధతులపై వాణిజ్య రైతులకు, గ్రామంలో పొగాకు సాగు చేస్తున్న రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నారుమడి పెంపకం, తెగుళ్లు, పురుగు మందుల వాడకం గురించి రైతులకు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే నారు విక్రయించాలని ఆయన తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త ప్రభాకర్, ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ జోషి, ఐటీసీ ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, జీపీఐ ప్రతినిధి రవి, పీఏస్ఎస్ ప్రతినిధి సీతారామరాజు, క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

140 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

తాళ్లపూడి: మండల కేంద్రం తాళ్లపూడిలో శ్రీ సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆసుపత్రి సిబ్బంది గురువారం నిర్వహించారు. హాస్పిటల్ మూడోవ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్లు వీటి వర్మ, రామారావు, జగదీష్ మౌనిక తదితరులు జనరల్, ఆర్థోపెడిక్, గైనిక్, గ్యాస్ట్రిక్, లివర్ తదితర విభాగాలకు సంబంధించి 140 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ నామా గోపాలం, సిఈవో గూడా విజయరాజు, పార్టనర్ లింగంపల్లి సుధీర్‌లు మాట్లాడూతూ ఈ నెల 11, 12, 13వ తేదీ వరకు అన్ని రకాల ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గొడ్డు మాంసం దుకాణాల కూల్చివేత

నోటీసులు ఇవ్వలేదని బాధితుల ఆవేదన



దుకాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు



బాధితులతో చర్చలు జరుపుతున్న చైర్మన్ ఆదినారాయణ, సీఐ తిలక్, అధికారులు

నిడదవోలు: పట్టణ పరిధిలోని మున్సిపల్ సంత మార్కెట్‌లో శివారున ఉన్న గొడ్డు మాంసం దుకాణాలను మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను కూల్చివేయడంతో బాధితులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. సంత మార్కెట్‌లో గొడ్డు మాంసం దుకాణాల్లో మాంసం విక్రయిస్తూ ముస్లింల కుటుంబాలకు చెందిన సుమారు 500 మంది బ్రతుకుతున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా జేసీబీలతో దుకాణాలు కూల్చివేయడంతో మా కుటుంబాల జీవానోపాధి ప్రశ్నార్థకంగా మారిందని, తమకు ప్రత్యామ్నాయం మార్గం చూపించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. మాంసం విక్రయిస్తూ వాటి ద్వారా వచ్చే వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారని పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో దుణాలను తొలగించామని అధికారులు చెబుతున్నారు. ధవళేశ్వరంలో కళేబరాలను వేరుచేసి మాంసాన్ని ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుటున్నామని వారు తెలిపారు. దుకాణాల వద్ద ఎప్పటికప్పుడు మేమే శుభ్రం చేసుకుంటున్నామని, పట్టణంలోంచి వచ్చే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా దుకాణాల వద్ద డంప్ చేయడంతో అక్కడి పరిసరాలు అధ్వాన్నంగా తయారవుతున్నాయే తప్పా మా వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని పన్నులు సైతం చెల్లిస్తున్నామని బాధితులు చెబుతున్నారు. ఆందోళన నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి, సీఐ పీవీజీ తిలక్, మున్సిపల్ ఏఈఈ ఎస్.హేమంత్‌కమాల్ శ్రీనివాస్‌లు, కౌన్సిల్ సమావేశ మందిరంలో వ్యాపారులతో చర్చలు జరిపారు.

తలారి వెంకట్రావు పరామర్శలు



వరలక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులురాలు నేతల వరలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం వారి కుటుంబ సభ్యులను స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. వరలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, ఉప్పులూరి సూర్పిబాబు, శ్రీరంగం సత్యప్రసాద్, బంధుల రామారావు, మారిన సూర్య చంద్రం, యండపల్లి లక్ష్మణరావు తదితరలున్నారు.

పోషకాలు-తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన

నల్లజర్ల: ఉద్యాన తోటల్లో మొక్కలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను అజిటోబక్టర్, ఫాస్ఫరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వినియోగించి సేంద్రియ పద్ధతిలో ఉద్యానసాగు చేపట్టవచ్చునని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం) డాక్టర్ శేషకిరణ్ రైతులకు సూచించారు. నల్లజర్ల ఉద్యాన అధికారి యం.బబిత అధ్యక్షతన గురువారం ప్రకాశరావుపాలెం రైతు సేవాకేంద్రం వద్ద ఉద్యాన తోటల పోషకాలు-తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలపై ఆశించే వివిధ రకాల తెగుళ్ల ట్రైకోడెర్మావిరిడీ, సూడోమనాస్ ఫ్లోరోసిస్, బాసిల్లస్ సెబ్టిలిస్ ఆధారిత ద్రవ రూప జీవనియంత్రణ సూక్ష్మజీవులను ఉద్యాన పరిశోధనస్థానం అందిస్తున్న అజిటోబక్కర్, పొటాష్ మొబలైసింగ్ బ్యాక్టీరియా ఎకరానికి లీటరు చొప్పున వాడితే రసాయన ఎరువులు మోతాదును 30 శాతం తగ్గించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, త్రీఎఫ్ ఆయిల్‌ఫాం సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారిణి ప్రేమను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆర్.ప్రేమ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్.అరుణ రాజేశ్వరి ఫిలిప్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ గౌరిపట్నం ఎస్‌వీజీవీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్ -19 జూనియర్ విభాగం పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈనెల 12 నుంచి 14 వరకు జగగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. పీఈటీలు సుందర జేమ్స్, కృష్ణకుమారి, వి.శాంతి, ఎస్ఎంసీ చైర్మన్ అడపా ఆదిలక్ష్మీ, పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఒత్తిడి తగ్గించండి మహాప్రభో



ఎంపీడీఓకు మెమొరండం అందిస్తున్న ఉద్యోగులు

పెరవలి: మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సచివాలయ ఉద్యోగులు పని ఒత్తిడి తగ్గించాలంటూ ఎంపీడీఓ పద్మజకు మెమొరండం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఓ వైపు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తు, ఒక్కసారే నాలుగు సర్వేలు చేయటం కష్టసాధ్యంగా ఉందని దీని వలన ఒత్తిడి పెరుగుతుందని వాపోయారు. వెంటనే ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. ఈ కార్యక్రమంలో రేవు బాలసాయి కృష్ణ, మోర్త సంజయ్, విల్లా సతీష్ కుమార్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు) 90100 51493 (నిడదవోలు)

79956 78554 90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com